క్లుప్తంగా

వేడుకగా శ్రీవారి తిరువీధి సేవ



క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఊరేగింపు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో చినవెంకన్న తిరువీధి సేవ ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు గోదాదేవితో కలసి స్వామివారు ఉదయం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారి వాహనం క్షేత్ర పురవీధుల్లో తిరుగాడింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపారు. ఆ తరువాత భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మానవత ఆర్థిక సాయం



కొత్తూరులో క్షతగాత్రుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలో స్థిరపడిన పోలవరం నిర్వాసిత గ్రామం కొత్తూరుకు చెందిన కంచుమర్తి శ్రీనివాస్‌కు కొయ్యలగూడెం మానవత స్వచ్ఛంద సంస్థ రూ.8 వేలు ఆర్థిక సహాయం అందజేసింది. నెలరోజుల క్రితం కొయ్యలగూడెంలో జరిగిన ప్రమాదంలో కంచుమర్తి శ్రీనివాసుకి రెండు కాళ్లు పోవడంతో విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు, సభ్యులు ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, భవిరిశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ చంటి రూ.వెయ్యి చొప్పున బాధితుడికి ఆర్థిక సహాయం అందజేశారు. వీఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత స్వామి బాధితుడి పిల్లలు ఇద్దరికీ పదవ తరగతి వరకు ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు బొమ్మ మోహన్, మందపాటి రామకృష్ణ, గిద్దే మోహన్, బూసి త్రిమూర్తులు, కొత్తూరు సర్పంచ్ భద్రాద్రి పాల్గొన్నారు.

స్మార్ట్ టీవీ, వాలీబాల్ కిట్ల అందజేత



హాస్టల్ విద్యార్థులకు స్మార్ట్ టీవీ, వాలీబాల్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి మండలం, ప్రగడవరం సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం విద్యార్థులకు మెప్మా డైరెక్టర్ బొడ్డు ఇమ్మానుయేలు స్మార్ట్ టీవీ, రెండు జతల వాలీబాల్ కిట్లు అందజేశారు. గతంలో ఆయన హాస్టల్‌ను సందర్శించినప్పుడు విద్యార్థులు టీవీ, వాలీబాల్ కిట్లు కావాలని కోరడంతో ఆయన సొంత ఖర్చులతో ఆదివారం వసతిగృహం విద్యార్థులకు టీవీతో పాటు ఆట సామగ్రి అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రత్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు పి వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థికి సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ కాలనీలో ఆదివారం విద్యార్థికి ఆర్థిక సహాయం అందించారు. వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కొడ్డేటి మౌనిక అనే విద్యార్థికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దాత యమసాని శ్రీనివాసరెడ్డి, అనూష దంపతులు ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని దాత తండ్రి భాస్కరరెడ్డి, సోదరి పోతుల మాధవి విద్యార్థికి అందజేసినట్లు వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు, కౌన్సిలర్ వలవల తాతాజీ తెలిపారు. కార్యక్రమంలో వలవల మేరీ సుశీలా, వారధి ట్రస్ట్ సభ్యులు కొత్తపల్లి సురేష్, కొత్తపల్లి నరేష్, కొల్లి రామసూరిరెడ్డి, తాళ్ల దుర్గాప్రసాద్, విద్యార్థిని కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

బుట్టాయగూడెం: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు క్రైస్తవ సోదరులు అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో గల గ్రామాల్లో ఉన్న అన్ని చర్చిల్లో వేడుకలకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే డిసెంబర్ ప్రారంభం నుంచి అనేక చర్చిల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. అయితే క్రీస్తు పుట్టినరోజుగా చెప్పబడే 25వ తేదీన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లూథరన్, పెంతికోస్తు, షాలేం, ఆర్సీఎం చర్చిలన్నీ విద్యుత్ అలంకరణ కాంతులతో ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీలు, స్టార్స్ కూడా విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా ఏర్పాటు చేశారు. అలాగే ఆదివారం రాత్రి పలు చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు క్రైస్తవ సోదరులు చేశారు. కాగా లూథరన్, ఆర్సీఎం చర్చిల సంఘస్తులు తెల్లవారుజాము నుంచే కేరల్స్ నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలరాజు

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవనం అందరికీ ఆదర్శమని తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గ నిర్దేశం చేశారని అన్నారు. క్రిస్మస్ పండుగను నియోజకవర్గంలోని క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందంగా జరుపుకోవాలని బాలరాజు కోరారు.

చింతలపూడిలో క్రిస్మస్ సందడి


చింతలపూడి: క్రైస్తవులు లోక రక్షకుడిగా కీర్తించబడే క్రీస్తు జన్మదినం సందర్భంగా పల్లెల్లో పండగ వాతావరణం తొణికిసలాడుతోంది. సోమవారం నాడు ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను జరుపుకోబోతున్నారు. ఇప్పటికే చర్చిల్లో , క్రైస్తవ భక్తుల ఇళ్లో పండుగ వాతావరణం ఏర్పడింది. క్రిస్మస్ సందర్భంగా చింతలపూడి మండలంలోని ఫాతిమాపురం, అల్లిపల్లి, యర్రగుంటపల్లి, సుప్రింపేట, బోయగూడెం, తెలె సోమవరం, ఆంథోని నగర్‌తో పాటు పలు గ్రామాల్లో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఇళ్ల ముందు నక్షత్రాలను విద్యుత్ కాంతులతో వేలాడదీశారు. అత్యంత ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడానికి క్రైస్తవులు ఏర్పాటు చేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని దుకాణాల్లో సందడి నెలకొంది. మెయిన్‌రోడ్డు, జీబీజీ రోడ్డులోని పలు దుకాణాలు క్రిస్మస్ స్టార్స్, గ్రీటింగ్స్ అమ్మకాలతో కళకళలాడుతున్నాయి.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చింతలపూడి మండలం ఫాతిమాపురం చర్చి



బుట్టాయగూడెంలోని ఆర్సీఎం చర్చిలో క్రీస్తు పుట్టుకను తెలుపుతూ పశువుల పాకను ఏర్పాటు చేసిన దృశ్యం



బుట్టాయగూడెంలోని కొమ్ముగూడెం సెంటర్ సమీపంలో విద్యుత్ అలంకరణ చేసిన ఆర్సీఎం చర్చి



జీలుగుమిల్లిలో గ్రేస్ మందిర్ చర్చిలో విద్యుత్ అలంకరణతోపాటు ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

సంజీవ ఆంజనేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం



సరిపల్లి సమీపంలో స్వయంభు సంజీవ ఆంజనేయ స్వామి మూలవిరాట్ విగ్రహం

కొయ్యలగూడెం: సరిపల్లి, బయ్యన్నగూడెం గ్రామాల మధ్య వెలసిన స్వయంభు శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈనెల 28వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మిరియాల వెంకటరావు తోటలో ఉన్న ఆలయం వద్ద హనుమద్ వ్రతం, అష్టోత్తర పూజ నిర్వహించారు. సోమవారం అష్టోత్తర పూజ హనుమద్ హోమం, 26వ తేదీ ఏకాదశ అభిషేకం, లక్ష తమలపాకుల పూజ, 27వ తేదీ అష్టోత్తర పూజ, అభిషేకం సాయంత్రం సువర్చలా సమేత హనుమద్ కల్యాణం, 28వ తేదీ హనుమాన్ చాలీసా పారాయణ మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెంలో 3కే రన్ ప్రారంభం



ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెంలో 3కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: యువతను చెడు మార్గం వైపు కాకుండా, క్రీడల వైపు మళ్లించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం 3కే రన్ కార్యక్రమాన్ని ఎలీజా ప్రారంభించి మాట్లాడారు. నేడు విద్యతో పాటు క్రీడలు సైతం భవిష్యత్‌ను నిర్దేశిస్తున్నాయని, యువత క్రీడల వైపు సాగి తమ లక్ష్యాన్ని సాధించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఆరోగ్యంగా ఉంటే ఆలోచనలు సైతం ఆరోగ్యంగా ఉంటాయని, తద్వారా సమాజం ఉన్నతిలో ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ఈనెల 26 నుంచి సచివాలయం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరగనున్న పోటీలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గ స్థాయి నుంచి క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులు సైతం అందివ్వనున్నట్లు చెప్పారు. 16 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కోకో, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ సందర్భంగా 3కే రన్‌కు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మేడవరపు విద్యాసాగర్, పట్టణ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, గురజాల పార్థసారథి, బత్తిన చిన్న, ఆర్డీవో కె.అద్దయ్య, కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఐ పి.రాజేష్, ఎంఈవో రాముడు, కౌన్సిలర్‌లు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు, వాకర్స్‌క్లబ్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా.. హనుమద్ వ్రతం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఆదివారం హనుమద్ వ్రత వేడుక కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు లక్ష తమలపాకులతో పూజను నిర్వహించారు. ముందుగా సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్ప మాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో పండితులు యజ్ఞకుండాన్ని ఏర్పాటుచేసి అగ్ని ప్రతిష్ఠాపనను జరిపి, వేద మంత్రోచ్ఛరణలతో క్రతువును నిర్వహించారు. అనంతరం ఆగమ విద్యార్థులు, భక్తులు తమలపాకులపై శ్రీరామ నామాలు రాశారు. ఆ తరువాత అర్చకులు, ఆగమ విద్యార్థులు వాటితో హనుమంతునికి పూజలు చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా హనుమద్ జయంతి

పోలవరం రూరల్: మండలంలో హనుమద్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు గూటాల పోలవరం గ్రామాల్లోని భక్తాంజనేయ స్వామి ఆలయాలు పచ్చని పందిర్లు విద్యుత్ అలంకరణతో ముస్తాబయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలు, సింధూరం, తమలపాకులతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.



తమలపాకులపై శ్రీరామ అని రాస్తున్న దృశ్యం



స్వామివారికి హారతులిస్తున్న ఆగమ విద్యార్థులు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

కుక్కునూరు: మండలంలోని ఇసుక రిచ్‌లలో ఇసుకను ప్రభుత్వం తరుపున నిర్మించే నిర్మాణాలకు మాత్రమే వినియోగించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాములేరు, ఇబ్రహీంపేట నుంచి ఇసుక అక్రమ తరలింపు జరుగుతుందన్న ఫిర్యాదు మేరకు ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి పాములేరు వాగును, ఇబ్రహీంపేట ఇసుక రిచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుకను ప్రభుత్వ నిర్మాణాలకు తప్ప ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఇసుక అక్రమ తరలింపు జరగకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. సచివాలయ సిబ్బంది ఇసుక తరలింపు విషయమై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అక్రమంగా తరలించినట్లు తెలిస్తే వారి వివరాలు సేకరించాలన్నారు. అనంతరం మండలంలో అనుమతులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారని ఆదివాసీ సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కొయ్యలగూడెంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: క్రిస్మస్ విశ్వ వ్యాప్త వేడుక అని పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో మన్నా చర్చి వద్ద జరిగిన క్రిస్మస్ వేడుకలలో సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని క్రిస్మస్ అంటే ఏసుక్రీస్తుని ఆరాధించడమని, ప్రపంచ దేశాలలో కూడా జరుపుకునే అది పెద్ద పండుగ క్రిస్మస్ అని ఆమె తెలిపారు. ప్రత్యేక ప్రసంగీకులు క్రీస్తు మాటలను విశ్వాసులకు సూచించారు. సంఘ కాపరి కంచుమర్తి బాబురావు, (మోషే) యూత్ సభ్యులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

విలీన ఐక్యత మహాసభను జయప్రదం చేయాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక రోటరీ క్లబ్‌లో సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి షేక్ గౌస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పోటు రంగారావు మాట్లాడుతూ మతోన్మాద పాసిస్టు విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను ప్రతిఘటించేందుకు బలమైన ప్రజాస్వామిక విప్లవోద్యమం అవసరం ఉందన్నారు. ఇందుకోసం విప్లవ పార్టీలు ఒక పార్టీగా ఏర్పడాలని నిర్ణయించుకున్నాయని అన్నారు. సీపీఐఎంఎల్ ప్రజాపందా, పీసీసీ, సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ రెవల్యూషనరీ ఇన్సియేటివ్ పార్టీలు విలీన ఐక్యత మహాసభ 2024 మార్చి 3, 4, 5వ తేదీలలో ఖమ్మంలో జరుగుతుందని, జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళా కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన నేరంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. స్థానిక జాబిల్లి ఆసుపత్రి సమీపంలోని శ్రీనివాస టైపింగ్ ఇనిస్టిట్యూట్ వద్ద ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతున్నారన్న సమాచారం మేరకు మహిళా కానిస్టేబుల్ సోడెం నాగదుర్గ ఘటనా స్థలానికి వెళ్లారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చే క్రమంలో కుంజె గంగాధర్, భార్య తులసి మహిళా కానిస్టేబుల్‌పై దుర్భాషలాడి దాడి చేశారన్నారు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ వినియోగదారులు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు కుకునూరి రామచంద్రరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టాలను అవసరమైన సందర్భాలలో ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఆర్.భాస్కరరావు మాట్లాడుతూ వినియోగదారుల తీర్పులకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పుకు సంతృప్తి చెందనట్లయితే పైకోర్టులకు ఏ విధంగా అప్పీలు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.మధు, యు.వెంకటాచార్యులు, హనుమంతరావు, డా.కె.ఉత్తమ్ సాగర్, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన షష్ఠి మహోత్సవాలు

కొయ్యలగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా అభిషేక అర్చనాది నిత్య పూజలతో పాటు మండల వ్యాప్తంగా షష్ఠి మహోత్సవాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసిద్ధిగాంచిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాల సందర్భంగా చిన్నారులకు తులాభారం నిర్వహించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, ఆలయాలలో ఉత్సవాలు ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.